# 1

## అం'తరం'

పెద్దులు లేచి కొయ్యకు వేలాడుతున్న ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు. అరనిమిషం గరగరమని, రేడియో కార్యక్రమాలు ప్రారంభం కాబోతున్నట్లు ఎనౌన్స్‌మెంటు వినిపించింది. బీడి వెలిగించుకుని, టవల్ కప్పుకుని, పెద్దులు దొడ్లోకి వెళ్ళాడు. పెద్దులు తల్లి రాములమ్మ అప్పటికే లేచి నిండా ముసుగు కప్పుకొని కూచుంది. చేతులు జోడించి భగవంతుణ్ణి ప్రార్థించుకుంది. పెద్దులు భార్య యాదమ్మ వాకిలి వూడ్చి, 'సానిపి' జల్లి, ఇంట్లో కొచ్చింది. రోడ్డు మీద సైకిల్ రిక్షాల మధ్యనుండి నాలుగైదు బర్రెల్ని, ఓ ఆవును తోలుకు పొయ్యాడు పశువుల కాసే పోరడు.

పెద్దులు ఇంటిముందు శంకర్‌దాదా సైకిల్ ఆపి, బెల్ కొట్టాడు. 'ఎంకటేశ్'- అని ఓసారి పిలిచాడు. సమాధానం రాలేదు. మళ్ళీ పిలిచాడు. రెండోసారి కూడా సమాధానం రాకపోయే సరికి, విసురుగా ముందుకు వెళ్ళి పొయ్యాడు. దొడ్లోంచి వచ్చిన పెద్దులు 'ఎవరా పిలిచేది?' అన్నట్లు ఇంటి ముందు చూసి, ఇంకా లేవని పెద్ద కొడుకు వెంకటేశ్‌ను చూశాడు. వెంకటేశ్ ముసుగుతన్ని ముడుచుకుని పడుకున్నాడు.

"అద్దరాతిరిదాకా బలాదూరు వూరు దిరుగుడు. పొద్దెక్కేదాక పండుడు"- అని భార్యను చూస్తూ అన్నాడు. తమ కాలంలో 'గోరు కొయ్యల్లు పొడువంగ' లేచి మోటగొట్టేదని, ఈ కాలం పిల్లలకు బరువు బాధ్యతలు తెలియవనీ విసుక్కున్నాడు. యాదమ్మ వారించింది.

అప్పటికాలం వేరు ఇప్పటికాలం వేరు అని వాదించింది. లేచి చేసే పనేం లేదు గనక, పడుకున్నాడని సర్ది చెప్పింది. పెద్దులుకు చుర్రుమని కోపం వచ్చింది. లేచి పనిచేయదలుచుకుంటే పనెందుకుండదూ ? అని ఎదురు ప్రశ్నించాడు. పాలుకూరలు తేవొచ్చని, సరైన ఉద్యోగం దొరికే వరకు చిన్నచిన్న పనులేవైనా చేసుకోవచ్చని, డిగ్రీ అయ్యిందని ఎవరూ పూలదండలేసి పిలవరని- పెద్దులు 'నోరు నెత్తిన' పెట్టు కున్నాడు. అయితే ఇదే మొదలు కాదు. ఇలాంటి ఘర్షణ ఆ ఇంట్లో సర్వ సామాన్యంగా అయ్యేదే!

రాములమ్మ మనుమణ్ణి దీనంగా చూసింది. వెంకటేశ్ అప్పుడే మేల్కొన్నట్లున్నాడు. మౌనంగా తండ్రిమాటలు ముసుగులోంచే విన్నాడు. తెల్లవారిందన్న సంతోషం ఏమాత్రమూ లేదు. ఇక తప్ప దన్నట్లుగా లేచి కూర్చున్నాడు. నిరాశా నిస్పృహల్ని మడత పెడు తున్నట్లుగా, దుప్పటి మడతేస్తుండగా చెల్లెలు సరోజన దగ్గరగా వచ్చి గుసగుసలాడింది.

"సీన్మలకు బోతె రెండో ఆటకెందుకు బోతవ్ ? మొదటాటకు బొయి బిరాన్రారాదూ?"- అని అన్నను కోపగించుకుంది. "నాయిన కోపంమీదున్నడు" అని విషయం తెలియజేసింది. అందులో జాగ్ర త్తగా మసలుకోవాలన్న హెచ్చరిక కూడా వుంది.

వెంకటేశ్‌కు అది మామూలే. లేచి అద్దం దగ్గరికి వెళ్లాడు. దువ్వెనతో దట్టమైన వెంట్రుకల్ని చిక్కులు దీస్తూ చాలా సేపు దువ్వాడు. వంటింటి గడప ముందు చాయ్ తాగుతూ కూర్చున్న పెద్దులు, కొడుకును మాటలనడం మానేశాడు. కాని కోపంగా చూడడం మానలేదు. దువ్వుకుంటున్న వెంకటేశ్‌కు, తండ్రి తనను తీక్షణంగా చూడడం అద్దంలో కనిపించింది. మరింత గతుక్కు మన్నాడు. తల కింది కేసుకుని, గూట్లోని మంజన్ పళ్ళపొడి తీసు కుని, ఫుల్‌షర్టు చేయి పైకి మడుచుకుంటూ దొడ్లోకి వెళ్లాడు. పెద్దులు చూపులు కొడుకునే అనుసరించాయి.

"ఏంది? అట్ల సూస్తవ్ అన్ని? కండ్లల్ల బెట్టుకోకు. ఇగ నౌకరే దొర్కదా? ఆడు బాగనేకాడా?"- అంది యాదమ్మ బియ్యం కడుగుతూ.

మంచంలోని రాములమ్మ ఆకుల కోసం వెతుక్కుంది. మెత్త (దిండు) కిందా, మంచంచుట్టూ చూసింది. ఏమీ కనిపించలేదు. అతి కష్టంతో 'సరోజనా' అని పిలిచింది. ఆమె హీన స్వరం సరోజనకు వినిపించలేదు. నాలుగుసార్లు నోరు చప్పరించి, మళ్లీ పిలవడానికి ప్రయత్నించింది. అ ఇంట్లో ఎవరి పనులు వారికున్నాయి. రాములమ్మ పనులకోసం ప్రత్యేకంగా ఎవరూ లేరు. కాని ఎక్కువగా మనుమరాలు సరోజనే చూసుకుంటుంది. నిజానికి రాములమ్మకు అక్కడ వుండడం ఇష్టంలేదు. వూరూ వాడ విడిచి 'కాని రాజ్యం'లో కొచ్చి ఉండడం ఆమెకు ముండ్లమీద వున్నట్టుగా వుంది. కానీ, తప్పదు- కొడుకులిద్దరిమధ్య ఒప్పందం అలా కుదిరింది. సంవత్సరంలో ఆరు నెలలు ఇక్కడ- పెద్దకొడుకు దగ్గరుండాలి. మరో ఆరు నెలలు ఊళ్లో చిన్న కొడుకు దగ్గరుండాలి. తిన్నా, తినకున్నా- వున్నా, లేకున్నా - వూళ్లో వుండడమే ఆమె కిష్టం. అక్కడ తనను ఆప్యాయంగా పలకరించే వాళ్ళున్నారు- తనను గౌరవించేవాళ్ళు, తను వయసులో వుండగా చూసినవాళ్లూ వున్నారు. రజాకార్లనాటి విషయాలు మాట్లాడుకోవడానికి తోటివాళ్ళు ఒకరిద్దరున్నారు. ఇక్కడ ఈ పట్నంలో ఎవరూ లేరు. ఎటూ వెళ్ళడానికి లేదు. ఎవరూ మన స్ఫూర్తిగా మాట్లాడరు. వేళకింత తిండిపెట్టడమే గొప్ప విశేషంగా వుంటుదిక్కడ!

పెద్దులు చిన్నకొడుకు నర్సింహ, పుస్తకాలతో ఇంట్లో కొచ్చాడు. రాములమ్మ పడుకునే మంచంపైన గోడ అల్మారా వుంది. నర్సింహ అందులో పుస్తకాలు సర్దుకున్నాడు. ఇంటర్ ఫైనలియర్‌లో

వున్న నర్సింహ ఈమధ్య సుబ్బారావు సారింట్లో చదువుకుంటున్నాడు. క్లాస్‌మేట్స్‌తో కలిసి, అక్కడే పడుకుంటున్నాడు.

ఆకులు అయిపోయాయన్న విషయం గొణుక్కుంది రాములమ్మ. నర్సింహ సానుభూతిగా చూసి, వెళ్ళి తల్లికి చెప్పాడు. ఆమె భర్తవైపు చూసింది. భర్త, పెద్దులు రేజర్ లేకుండా వుట్టి బ్లేడుతోనే గడ్డం పరపరా గీసుకుంటున్నాడు. ఆకులు అప్పుడే అయిపొయ్యాయా-అన్నట్లు ఓ క్షణం ఆశ్చర్యంగా చూసి, తెప్పించమని తల వూపాడు. తల వూపగానే సరిపోదని ఇంట్లోకిచ్చే 'పైసలు' దేనికీ సరిపోవడం లేదని, ఉన్నదున్నట్లు చెబితే తను, చెడ్డదాన్నవుతున్నానని-పెద్దగా అనడం మొదలుపెట్టింది యాదమ్మ.

ఒక్కసారే ఓ ఐదు రూపాయల ఆకులు తెచ్చిపడేస్తే బోలెడు రోజులొస్తాయని అన్నాడు నర్సింహ. ఐదు రూపాయలు ఎలా రావాలని యాదమ్మ ప్రశ్నించింది. ఐదు రూపాయలు కాదు, బజార్లోకి పోయి ఐదుపైసలు తెండి చూద్దాం అన్నట్లు "సంపాదించేది ఒక్కడు. తిని కూసునేది ఇంతమంది!"- అని కాసేపు భర్తను వెనకేసుకొచ్చింది. పెద్దులు భార్యవైపు ప్రేమగా చూసి చిన్నగా నవ్వుకున్నాడు. ఒక తల్లిగా, ఒక భార్యగా యాదమ్మ ఒక్కోసారి ఒక్కోరకంగా మాట్లాడుతూ ఉంటుంది. ఎటువైపునుండి మాట్లాడినా అందులో నిజమే వుంటుంది. ఆమె తమ బతుకుల గూర్చి మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యలోనే టక్కున ఆగిపొయ్యింది.

అందుకు కారణం యాదగిరి.

యాదమ్మ, పెద్దులు గుమ్మంవైపు చూశారు-

యాదగిరి ఇంట్లోకొచ్చాడు.

అతడలా వస్తాడన్నది వూహించని విషయం. యాదగిరి, పెద్దులు తమ్ముడు. ఊళ్లో వుంటాడు. ఏమీ చదువుకోక పోవడంవల్ల, ఊళ్లో వ్యవసాయం చేసుకుంటున్నాడు. భూమి పంచాయతి జరిగి,

వేరుపడ్డప్పటి నుండి పెద్దులు, యాదగిరిల మధ్య దూరం ఎక్కువైంది. పొరపాటున ఎక్కడైనా కలుసుకున్నా మాట్లాడుకునేవారు కాదు. అలాంటిది ఇన్ని సంవత్సరాల తర్వాత అతడు ఇల్లు జొచ్చుకొని రావడం అందరికీ ఆశ్చర్యంగానే వుంది. ఎవరూ ఏమీ అనలేదు. చెప్పులు విడిచి యాదగిరి మరో రెండడుగులు ముందుకొచ్చాడు. తల్లి మంచం కనిపించింది. వెళ్ళి తల్లిని తాకాడు. చేతిలోవున్న తమలపాకులు, జర్దా పొట్లం ఆమెకిచ్చాడు.

"మా నాయినే, మా నాయినే. అన్నింటికి ఒచ్చినావ్ బిడ్డా, ఎంతైనా ఒక్క రక్తం నాయినా. పాశిపొవ్వొద్దు. నలుగుట్ల నగుబాటుగావొద్దు. కోపాలమీద తిట్టుకున్నా, సాపిచ్చుకున్నా మర్వాలె. కల్సి మెల్సి ఒక్క పట్టుండాలె"- అని గద్గద స్వరంతో రాములమ్మ చిన్న కొడుకు చెయ్యి నిమిరింది. ఆ ముసలితల్లి కళ్లు శాంతంగా దేదీప్యమయ్యాయి. "శాంతమ్మ పండుక్కు ఒచ్చిపోయిందా?"- ధనుంజయ పదింట్లకెల్లి ఎల్లిండా?"-అని ఆమె అడుగుదామని అనుకునే లోపల యాదమ్మ పెద్దచెంబుతో కాళ్లు కడుక్కోవడానికి నీళ్ళు పెట్టింది.

అందరు బాగున్నరా నయ్య"- అని అడిగింది.

వదినవైపు ఆత్మీయంగా చూశాడు యాదగిరి.

"ఆఁ- అంత బాగే"నని చెప్తూ చెంబుతో బయటికి వెళ్ళాడు. కాళ్ళు కడుక్కొని వచ్చి, పైగుడ్డతో ముఖం తుడుచుకున్నాడు. సాయబాను గుంజకు వీపు ఆనించి కాళ్ళమీద కూచున్నాడు.

"ఎప్పుడెల్లినవ్" - అడిగాడు పెద్దులు పొడిగా.

"నిన్న! నిన్న పొద్దుమీకే ఒచ్చిన"- అన్నాడు యాదగిరి తల్లివైపు చూస్తూ. మందు సంచి వేసుకుపోదామని, తను నిన్ననే వచ్చానని, వెంటవున్న మేర ఈరయ్య, కమ్మరి ఇశ్వనాథం రాత్రి సినిమాకు తీసుకుపొయ్యారనీ-చెప్పాడు. రెండో ఆట వదలగానే, ఆ

పక్కనే వున్న మేర ఈరయ్య బావమరిది టైలరింగ్ షాప్‌లో పడుకున్నామని - చెప్పాడు.

ఎట్లా కలిసివున్న కుటుంబం ఎట్లా ముక్కలయ్యిందోనని.... యాదమ్మ కళ్ళకు నీళ్ళు తెచ్చుకుంది. కలిసి వున్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి. "ఒదినమ్మా ! ఒదినమ్మా !!" - అని చనువుగా తిరిగేవాడు; పరాయివాడిలాగా, చుట్టం లాగా బయట కూర్చోవడం ఆమెకు బాధ కలిగించింది. అదే బాధ పెద్దులుకు కూడా కలిగింది. మనసులో వున్న అడ్డుగోడల్ని ఛేదించి, కౌగలించుకుని, మన స్ఫూర్తిగా మాట్లాడదామనుకున్నాడు. కాని పొలం పంచాయతినాటి విషయాలు, వూళ్ళోవాళ్ళ చెప్పుడు మాటలు, పంతాలు పట్టింపులు గుర్తుకొచ్చినయి. చేద్దామనుకున్న పని చెయ్యలేక పొయ్యాడు. సర్రున లేచి దొడ్లోకి వెళ్ళాడు. దొడ్లో వెంకటేశ్, నర్సింహలు నీళ్ళు తోడి తొట్టి నింపుతున్నారు. ఒకప్పుడు తను, తన తమ్ముడు అంత కన్నా సఖ్యంగా కలిసి మెలిసి పనులు చేసేవారు. పెద్దులు మనసు నీళ్లనీళ్ళయ్యింది.

"అయిపోయిందికదా ! కుక్కలు జింపిన ఇస్తరోలె అయ్యింది. ఇంకెందుకు పట్టింపులు ! మాటన్న నోటినిండ మాట్లాడుకోరాయె"- అంది యాదమ్మ, మరిదికి చాయ్ తెచ్చిస్తూ. తన మగడు ఇంటి కొచ్చిన మరిదితో సరిగా మాట్లాడలేదన్న ఆక్రోషాన్ని ఆపుకోలేక ;

ఒక్కసారి వదినవైపు నింపాదిగా చూసి, బరువుగా గాలి పీల్చి వదిలాడు. చాయ్ గ్లాసందుకుని తల్లి మంచం దగ్గరకు వెళ్ళాడు. ఆమె తన స్వంత గోడు వెళ్ళబోసుకుంది. చాయ్ తాగడం కాగానే వెళ్తానని చెప్పి లేచాడు.

"అయ్యో - అప్పుడే పోతవా ?" అంది యాదమ్మ. ఆమెలో ఏదో వాత్సల్యం గిలగిల కొట్టుకుంది. అయితే గట్టిగా ఉండమనీ

అనలేకపొయ్యింది. "మీ అన్న తానానికి బొయిండు. ఒచ్చేదాకనన్న కూసుండరాదు" - అని మాత్రం అనగలిగింది.

"ఆఁ - ఆఁ - తానం జెయ్యనీయ్‌గని ! ఆఫీసుకు బోయెటొ డాయె. ఇగ నేను బోత. ఏం లేదు....మీ రకం (భూమి పన్ను) నలభై మూడ్రూపాయల అర్వయి అయిదు పైసలొచ్చింది. పట్వారి దగ్గర్నించి మస్కూరోడు చిట్టి తెచ్చిచ్చి పోయిండు. మరి ఓ పూట ఒచ్చి, రకం గట్టి పొమ్మను........ఇగ బిడ్డ పెండ్లికి పెద్దులు భూమ మ్మితాండని వూరంత దెలిసె గని, మాకైతె దెల్వనీయక పోతిరి. సరె, దాన్దేమున్నది ? మీ భూమి మీ రమ్ముకుంటరు. కని ఒక్కమాట నాకు జెప్తె నా కింత నిమ్మలముండు. మా అన్న భూమి అమ్మే సంగతి నాకు పరాయోడు జెప్పాల్నా ? నాకు పిల్లలున్నరు. వొరం వొరం గల్సిన భూమి, నలుగురు పెద్దలు జెప్పిన కాడికి నేనే ఉంచుకుందు."

రాములమ్మ అయోమయంగా చూసింది.

యాదమ్మకు తల కొట్టేసి నట్లయ్యింది.

"........మొన్న వూల్లెకొచ్చె గని, ఇంటిదాకన్న రాకపాయె. పిల్లలు పటేలింటికాడ పెద్దనాయినను జూశి ఎంత సంబ్రపడ్డరు ; పొయ్యేటప్పుడైన ఇంటికొస్తడేమోనని....ఎంతెదిరి జూశినం? ఆటుదబె సర్వీసెక్కి ఒచ్చి పట్నంలబడె" - మరిది మాటలు విని—

"అయ్యో ! ఖర్మ - ఖర్మ" - అని నెత్తి కొట్టుకుంది యాదమ్మ. "రాత - రాత గిట్లున్నది ! ఎవ్వరేం జేస్తరు ? మీ అన్న సంగతి దెల్వ నిదేమున్నది? నాతోటి ఓటి జెప్తడా? చెప్పింది జేస్తడా? ముదనష్ట పోడు. ఎప్పుడింతేనాయె....ఇగ నీకెరుక లేనిదేమున్నది?" - యాదమ్మ కొంగు నోటికి అడ్డం పెట్టుకుంది.

ఒక్క నిమిషమాగి, యాదగిరి లేచాడు. కండువ భుజాన వేసుకుని, చెప్పులేసుకుని రెండంగల్లో గడప దాటాడు. వెనక్కైనా తిరిగి చూడకుండా వేగంగా వెళ్ళిపొయ్యాడు. పాపం పిల్లలు వాళ్ళేం

చేశారు? వెంకటేశ్, నర్సింహ, సరోజనలను చూడకుండానే బయట పడ్డందుకు లోలోపలే మధనపడ్డాడు.

రాములమ్మకు చూసే శక్తీ, ఏడ్చే శక్తీ లేదు. కాని మన సంతా కలకలమంది. తడితడిగా అయ్యింది. దిగులు ఎక్కడికో లోలోతుల్లోకి దిగిపోతున్నట్లయ్యింది. రామలక్ష్మణులవలె తనకు కొడుకు లిద్దరు. ఊరివాళ్ళంతా అసూయతో కుమిలిపొయ్యేట్లు బతికారు. తన పెనిమిటి, మరిది, బావలు కూడా అంతే. ఒక చేతి వేళ్ళ లాగా పుట్టి పెరిగారు. చివరకు వేళ్ళూడిపోయిన కుష్టివాడి అరచేయి లాగా చేశారు సంసారాన్ని. న్యాయం ఎవరిది? అంటే చెప్పడం కష్టం. ఎవడిమాట వింటే న్యాయం వాడివైపే వున్నట్లు వుండేది.... ఏమైనా....చివరకు....కుండమాత్రం బద్దలయ్యింది. కూరాళ్ళు విడిపొయినయి. తడకలతో, అడ్డుగోడలతో ఇల్లు ఇరుకయ్యింది. బయట పొలం ముక్కలయ్యింది. ఇంట్లో తల్లిదండ్రుల మనసు చెక్కలయ్యింది.

తన అత్తమామల స్థానంలో ప్రస్తుతం తనుంది. రేపొద్దున తన స్థానంలో వెంకటేశ్ వస్తాడు.... కాలచక్రం ఇరుసులో పడి తరం తర్వాత తరం నలిగిపోతున్నట్లుగా అనిపించింది.

అప్పటిదాకా పక్కింట్లో వున్న సరోజన, పెరట్లో కూలిన గోడలమీది నుండి ఇంట్లో కొచ్చింది. రోజుటిలాగానే రాములమ్మను లేపి నిలుచోబెట్టింది- మెల్లెగా నడిపించి ఇంటిపక్కన 'చింత' చెట్టు మొదట్లో కూర్చోబెట్టింది. 'రాతెండి' సర్వతో నీళ్ళు పెట్టింది. "నాయినమ్మా జల్ది మొకం కడుక్కో- చాయ సల్లారిపోతాంది"- అంది.

దేనికి జల్ది బిడ్డా! ఏది సల్లారి పోలేదు బతుకుల ! అని" గొణుక్కుంది రాములమ్మ. జీవితపు అంచున కూర్చొని! "ముసల్ది ఎప్పుడింతే. ఏదో సద్వుతనే వుంటది!"- అనుకున్న సరోజన అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

రాములమ్మ చెట్టు మొదట్లో కాండానికి ఆనుకుని, మెల్లెగా తలెత్తి పైకి చూసింది. కాండం ఒకే కొమ్మగా నిటారుగా పైకి ఎదగ లేదు. ఆకాశాన్ని ఆలింగనం చేసుకోబోతున్నట్లు శాఖలు- కొమ్మలు కొమ్మలుగా, రెమ్మలు రెమ్మలుగా దట్టంగా.... నేటి తరంలాగా వ్యాపించింది. భూగర్భంలో వ్రేళ్లూ అంతే.... పోయిన తరం కాల గర్భంలో వొదిగి వున్నట్లు, తల్లివేరుకు పిల్లవ్రేళ్లూ, వాటికి మళ్లీ చిన్నవ్రేళ్లూ పెరుగుతూ పెరుగుతూ స్థిరత్వాన్ని పొందుతున్నాయి. ఈ రెంటికీ వారధిలాగా యింకా నిలబడి వున్న కాండం....తనే! జీవితం అర్థమైనట్లయ్యింది. చెట్టుకింద కూలబడ్డ రాములమ్మకు లోకం 'రీతివాయి' ఇంతేనా? అని అనిపించింది.

"పంచాయతి జగడాల్లేని ఇల్లుంటదా?"

"ఎవనింట్లనైనా మట్టిపొయ్యే వుంటది గని. బంగారి పొయ్యుంటదా?"

"కొమ్మలెన్నయితే ఏంది? శెట్టయితె ఒకటె గద!"

మట్టిల బుట్టి మట్టిల గల్సినట్టు, మనిషి జల్మగూడ శెట్టు లెక్కనే గద?"

జీవితాన్నంతా వడబోస్తున్నట్టు రాములమ్మకు ఏవేవో ఆలోచ నలు, కొన్ని స్పష్టంగా కొన్ని అస్పష్టంగా.

"ఎంకన్నా ఇంటి మీద ఆగ్గెపుకాయుంది కొయ్యి బిడ్డా- ఇయ్యాల్లేం లేదు. ఏది కొనబోయినా ఇంగలం! ఇంగలం!! మండి పోతానయి."- కొడుక్కు చెబుతున్నట్టుగానూ, స్వగతంలో అను కుంటున్నట్టుగానూ అంది యాదమ్మ.

చెట్టెక్కడానికి వెంకటేశ్ రాలేదు-

చాలా సేపటి తర్వాత, నర్శింహ చిటికెలో చెట్టెక్కి కాయ కోశాడు.

పెద్దులు ఇంట్లో కొచ్చాడు.

మరిది మాటల్లోని సారాంశం భర్తకు చెప్పింది యాదమ్మ. పెద్దులుకు అందులో పెడర్థాలు తోచాయి. ఇల్లు జొచ్చుకుని వచ్చిన తమ్ముడి మంచితనం అతడికి అంతగా అర్థం కాలేదు. పాలివాడు పోట్లాటకు వచ్చినట్లుగానే భావించాడు. పెద్దులు బుద్ధిలో ఎన్నెన్నో కనిపించని గోడలు లేచాయి. అందుకే ఏమేమో గొణుక్కున్నాడు.

"ఆఁ - సూశిన. సూశిన - చాన జూశిన? ఇసోంటోల్లను - నీ యవ్వ? నేనూ గా వొయిసుల ఇర్వయి రూప్పాయల ఉజ్జోగం జేస్కుంట ఇంటి బరువంత మోశిన - శెల్లెలి పెండ్లి జేశిన. తమ్ముని పెండ్లి జేశిన.... శెర్వుకింద ఎకరంనర పొలం గొన్న - నీ - యవ్వ! ఎవని గర్జుకిదంత జేశిన? - ఏమన్న పనికొచ్చిందా ఇయ్యాల్ల? - ఇంక ఎందుకు ఈ రాస్కునుడు. పూస్కునుడు?"

పెద్దకొడుకు పెద్దులు మాటల్లో రాములమ్మకు కొమ్మలు నరుకుతున్న గొడ్డళ్ళ చప్పుడు వినిపించింది - మొహం కడుక్కునే ప్రయత్నంలో ఆమె బోసి నోటితో -

నీళ్ళు పుక్కిలించి వూసింది.

ఆ నీళ్లు కింద చెట్టు వ్రేళ్ళదాకా ఇంకలేవు.

పైన కొమ్మలమీదా పడలేవు.

బరువులు మోస్తూ పరుగెడుతున్న గూడ్సుబండి, ఆ వూరి స్టేషన్లో ఆగకుండానే కూతేసి వెళ్ళిపోయింది. ○

జ్యోతి మాసపత్రిక
మే 1988
ఒక తరం తెలుగు కథ
కేంద్రసాహిత్య అకాడెమీ 1993